ముగిసిన పాఠశాల స్థాయి క్రికెట్ పోటీలు


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు..

నారాయణపేట రూరల్: పట్టణంలోని మినీ స్టేడియంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి క్రీడాపోటీలు ముగిశాయి. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నిర్వహించే పోటీలు ఈ ఏడాది విజయవంతంగా పూర్తయ్యాయి. ఇరు గ్రూపుల నుంచి సెమీఫైనల్‌లో గెలిచిన జట్లకు బుధవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. దీనిలో లిటిల్‌స్టార్స్ ప్రథమ, ఎయిడెడ్ వైదిక ద్వితీయ స్థానంలో నిలిచాయి. వీరికి నిర్వాహకులు ట్రోఫీలను బహూకరించారు. ట్రస్మా మాజీ అధ్యక్షుడు పీ.నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి లలిత ఆధ్వర్యంలో జ్ఞాపికలతో పాటు బెస్ట్ బ్యాట్స్‌మెన్, బౌలర్, మ్యాన్‌ఆఫ్‌దమ్యాచ్, సిరీస్ అందించారు. కార్యక్రమంలో నందునామాజీ, సెక్రటరీ రమణ, అమరీష్, బాల్‌రెడ్డి, నర్సింహ, సాయిలు, అజిత్, గణేష్, ఇబ్రహీం, ఇమ్రాన్, ఉదయ్, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లను అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

నర్వ: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద విద్యార్థుల కాలినడక ఇబ్బందులను చూసి చలించానని వీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తపల్లి, కొండదొడ్డి నుంచి కాలినడకన పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థినులకు ఆయన సైకిళ్లను పంపిణీ చేశారు. రూ. 60 లక్షలు వెచ్చించి నియోజకవర్గ వ్యాప్తంగా సైకిళ్ల పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం నా వంతు సహాయసహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు.

రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో శాంతి కవాతు


కవాతులో పాల్గొన్న ఆర్‌ఏఎఫ్ జవానులు, పోలీసులు

ఊట్కూరు: మండల కేంద్రంలో బుధవారం రాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసులతో కలిసి గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మెయిన్ బజారు, అంబేడ్కర్‌చౌరస్తా, గాంధీ నగర్, శ్రీరాంనగర్, ఈశ్వర్ మందిర్ ప్రాంతాలలో ర్యాలీ చేపట్టారు. సీఐ రాంలాల్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు, వివిధ పండుగల సందర్భంగా గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలకు భద్రత భరోసా కల్పించడానికి వీధుల్లో కవాత్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలను కాపాడడానికి పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని గ్రామాలలోని ప్రజలు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



మాగనూర్: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని డీఆర్పీ రాఘవేంద్ర అన్నారు. బుధవారం వెలుగు అభ్యాసమిత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని నేరడగం ప్రాథమిక పాఠశాలతో పాటు వర్కూర్ పాఠశాలలోని వెలుగు అభ్యాసమిత్ర కార్యక్రమం అమలు తీరుపై డీఆర్పీలు రాఘవేంద్ర, శ్రీకాంత్ తనిఖీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. డీఆర్పీలు మాట్లాడుతూ.. పాఠశాలలో లెవల్ వన్, లెవల్ టులలో సీక్రెట్ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున ఉపాధ్యాయులు బోధన అభ్యసన సామగ్రిని ఉపయోగించి వారిని తరగతి గది స్థాయికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధాయులతో సమీక్ష నిర్వహించి ఏజీఆర్ నమోదు చేశారు.

జానపద కళాకారిణికి సన్మానం

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం చెందిన జానపద కళాకారిణి ఉషను బుధవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శాలువతో ఘనంగా సన్మానించారు. యూట్యూబ్‌లో జానపద పాటలు పాడుతూ వైరల్ అయ్యింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, సర్పంచ్ కతలప్ప, ఎంపీటీసీ రవిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మరమ్మతు చేపట్టండి

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్, పులిమామిడి, అవుసలోనిపల్లి వెళ్లే బీటీ రోడ్డును మరమ్మతు చేపట్టాలని బుధవారం తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ మహేష్‌గౌడ్ ప్రకటనలో కోరారు. బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

మంత్రిని కలిసిన నాయకులు



మద్దూరు: సమాచార పౌర సంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినా పట్నం మహేందర్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. బాల్‌సింగ్‌నాయక్, సర్పంచ్ గోవిందు, బసిరెడ్డి, శ్రీహరి, శ్రీహరి, తదితరులున్నారు.

రక్షాబంధన్ వేడుకలు



మరికల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు రాఖీలు కట్టుకున్నారు.

జల్దిబిందె ఊరేగింపు



నారాయణపేట: చౌడేశ్వరి అఖండ జ్యోతుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం బ్రహ్మణ్‌వాడి తొగట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో సద్గురు అవధూత నరసింహ స్వామి మఠం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన సంకీర్తనలతో జల్ది బిందే ఊరేగింపు చేపట్టారు.

గొర్రెల పంపిణీ



కోయిల్‌కొండ: మండలంలోని కేశ్వాపూర్, ఖాజీపూర్, ఆచార్యపూర్ గ్రామాల్లో బుధవారం గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి పాల్గొని పంపిణీ ప్రారంభించారు. సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బచ్చిరెడ్డి, రైతు సమితి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, వైస్‌ఎంపీపీ కృష్ణయ్యయాదవ్, సర్పంచ్ మొగులయ్య పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి

ఊట్కూర్: గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నపొర్లలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకై ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, పంచాయతీ భవనాలు, రైతు వేదిక భవనాలు నిర్మించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్ కుమార్‌గౌడ్, అరవింద్‌కుమార్, ఎంపీటీసీ రవిప్రసాద్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, షకీల్, ఇబాదుర్ రహిమాన్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం..

మక్తల్: సీఎం కేసీఆర్ ప్రభుత్వం క్రీడారంగాన్ని ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీల ఎంపికలను ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి మక్తల్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. త్వరలో క్రీడా పరికరాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేష్‌శెట్టి, ఎస్‌ఐ పర్వతాలు, అమరేందర్‌రెడ్డి, రూప, శ్రీవాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేరడగం మఠం పీఠాధిపతి జన్మదినోత్సవం


పీఠాధిపతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దంపతులు

మాగనూర్: మండలంలోని నేరడగం పశ్చిమాద్రి విరక్త మఠంలో బుధవారం పీఠాధిపతి శ్రీపంచమ సిద్ధలింగ మహాస్వామి జన్మదినోత్సవం భక్తులు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కర్ణాటకలోని గుర్మిట్‌కల్ ఎమ్మెల్యే కందుకూర్ శరణగౌడలు హాజరై స్వామి వారికి పూలమాలలతో, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 70 మంది విద్యార్థులకు పురస్కారాలు అందించారు. అనంతరం భక్తులనుద్దేశించి స్వామిజీ మాట్లాడుతూ.. మఠం అభివృద్ధికి భక్తులు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. మఠంలో ఇప్పుడు అనాథశరణాలయ నిర్మాణం, గోశాల, పాఠశాల ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో పరోపకారం, దానం, ధర్మం, సాయం అలవర్చుకుంటే వారి జీవనం నిత్య కల్యాణంగా రూపొందుతుందన్నారు.

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్టు


ధన్వాడలో అరెస్టు అయిన బీఎస్పీ నాయకులు


అరెస్టయిన బీఎస్పీ నాయకులు

ఊట్కూరు: మండల కేంద్రంలో బుధవారం బీఎస్పీ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు సూర్యపేటకు కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో వెళ్తుండగా ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు గౌతం మాట్లాడుతూ సూర్యపేటలో వడ్డె జానయ్య యాదవ్‌పై మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అనుచరులు దాడి చేశారన్నారు. అక్రమంగా అరెస్టు చేయడం తగదని ఆయన తెలిపారు. అరెస్టయిన వారిలో నాయకులు వెంకటేశ్, నాగేష్, తిమ్మప్ప, నర్సింహులు ఉన్నారు.

ధన్వాడలో...

ధన్వాడ: సూర్యపేట జిల్లాలో వట్టే జానయ్య యాదవ్‌కు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న బీఎస్పీ నాయకులను ధన్వాడ మండల కేంద్రంలో పోలీసులు అరెస్టు చేసి సొంత పూచికత్తుపై వదిలేశారు. ఇందులో జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేష్, రాజు, రవికుమార్, బాలరాజు, తిరుమలేష్ ఉన్నారు.

మాగనూర్: సూర్యపేటకు బయలుదేరిన బీఎస్పీ నాయకులను మాగనూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల నాయకులు శ్రీనివాసులు, అర్జున్, మహేష్, వసంత్ కుమార్, మహేష్ పాల్గొన్నారు.

పంటను ధ్వంసం చేసిన వ్యక్తులకు రిమాండ్

అమరచింత: సాగు చేసిన మూడు ఎకరాల పత్తి పంటను నాశనం చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. మండలంలోని కొంకన్‌వానిపల్లి శివారులో సర్వే నంబర్ 144లో పెద్ద గొల్ల లింగన్న మూడు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. అదే గ్రామానికి చెందిన గొల్ల మల్లేష్, మాసన్న ట్రాక్టర్‌తో పొలాన్ని చదును చేసి నష్టపరిచారని బాధితుడు పెద్ద గొల్ల లింగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మూడేళ్లుగా ఇదే పనిగా సాగుచేస్తున్న పంటను సదరు వ్యక్తులు నాశనం చేస్తున్నారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

18 మందికి జరిమానా

అమరచింత: మద్యం తాగి వాహనాలను నడుపుతున్న 18 మంది డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నా కొంత మంది మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారం

చిన్నచిన్న తగదాలతో కేసుల్లో ఇరుక్కున వారికి లోక్ అదాలత్‌లో తమ కేసులను పరిష్కరించుకొనే అవకాశం ఉందని ఎస్‌ఐ తెలిపారు. దీర్ఘకాలికంగా కేసులు పరిష్కారానికి నోచుకోని వారందరూ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నోటీసులకు భయపడేదిలేదు



మహబూబ్‌నగర్ న్యూటౌన్: రెండవ ఏఎన్‌ఎంల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా నోటీసులు జారీ చేయడమేమిటని, వైద్య ఆరోగ్య శాఖ జారీ చేస్తున్న అక్రమ నోటీసులకు భయపడేది లేదని ఏఐటీయూసీ నాయకులు రామ్మోహన్, పి.సురేశ్ హెచ్చరించారు. నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం రెండవ ఏఎన్‌ఎంలు కలెక్టరట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఏఎన్‌ఎంలు వైద్యారోగ్య శాఖ అధికారులకు రాఖీలు కట్టి నిరసన తెలిపారు. జయమ్మ, మంజుల, అన్నపూర్ణ, గిరిజ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ : విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈమేరకు జేపీఎన్‌సీ ఇంజనీరింగ్ కళాశాలలో 'రోడ్డు సేఫ్టీ పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, త్రిబుల్ రైడింగ్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజీవన్, కోఆర్డినేటర్ రాజేశ్, సాయికృష్ణ, సబ్‌ఇన్స్‌స్పెక్టర్ షంసుద్దీన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం



మక్తల్: మండలంలోని దాసర్‌దొడ్డి సమీపంలో పంట పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగి కాలిపోయింది. పంటలు సాగు చేసుకున్న రైతులకు ఇబ్బందులు ఏర్పడుతాయని, అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు.

సారా పట్టివేత

నారాయణపేట రూరల్: కొత్తగా ఏర్పాటైన రూరల్ పోలీస్ స్టేషన్‌లో సారా కేసు నమోదైంది. మండలంలోని బోయిన్‌పల్లి తండాలో సావిత్రమ్మ నిషేధిత సారా తయారు చేసి అమ్ముతుంది. పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఇంట్లో నిల్వ ఉంచిన 3లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ సంజీవయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టుమిషన్ కేంద్రం ప్రారంభం

మరికల్: మండల కేంద్రంలోని శివశంకర్ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ కేంద్రాన్ని బుధవారం సర్పంచు గోవర్దన్, వైస్‌ఎంపీపీ రవి, ఎంపీటీసీ గోపాల్ ప్రారంభించారు. రూ.లక్షతో కూడిన ఐదు కుట్టుమిషన్‌లను మంజూరు చేశారు.

ఫిజియోథెరపీ క్యాంపు విజయవంతం



నారాయణపేట రూరల్: పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఫిజియోథెరపీ క్యాంపు విజయవంతమైంది. డాక్టర్ ప్రీతిగౌడ్ ఆధ్వర్యంలో అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు, మానసిక దివ్యాంగులకు చికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రాజేంద్రకుమార్, టీచర్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తట్టుకోలేక భార్య బలవన్మరణం

కోయిల్‌కొండ: భర్త వేధింపులు తట్టుకోలేక భార్య బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని పారుపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డెరవితో 13ఏళ్ల క్రితం వడ్డె లక్ష్మికి వివాహమైంది. 8ఏళ్లుగా భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోగా ఎందుకు ఇలా చేస్తున్నావని భార్య నిలదీసేది. దీంతో శారీరకంగా వేధిచేవాడని, మంగళవారం రాత్రి లక్ష్మిని కొట్టడంతో ఇంట్లో పంచెతో ఉరేసుకుంది. మృతురాలి అన్న వడ్డెగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు.

గడినాడ ప్రాంత సమస్యలను పరిష్కరిస్తాం

● గుర్మిట్‌కల్ ఎమ్మెల్యే శరణగౌడ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శరణగౌడ

కృష్ణా: మండలంలోని గడినాడ కన్నడిగుల అభ్యున్నతితో పాటు కన్నడ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కర్ణాటకలోని గుర్మిట్‌కల్ ఎమ్మెల్యే కందుకూర్ శరణగౌడ అన్నారు. బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో పాటు ఆయన అభిమానులు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయనను పులమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ ఈ ప్రాంతంలోని కన్నడ మీడియం పాఠశాలల అభివృద్ధికి కర్ణాటక ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కోరారు. అదేవిధంగా కర్ణాటక ప్రభుత్వం గడినాడ కన్నడిగులకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో 4శాతం రిజర్వేషన్ అమలు చేయడం లేదని గుర్తు చేశారు. ఈ విషయంపై అసెంబ్లీలో చర్చించాలని ఆయనకు తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ గడినాడ కన్నడిగుల సమావేశంలో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట శివరాజ్ పాటిల్, సోమనాథరెడ్డి, బసన్న, మంజునాథస్వామి, రాజుస్వామి, శ్రీపాద్ తదితరులు ఉన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి


మక్తల్‌లో లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న ఎఎన్‌ఎంలు

మక్తల్: రాష్ట్ర వ్యాప్తంగా రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని అఖిల పక్షాల నాయకులు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, టీడీపీ ఉపాధ్యక్షుడు మధుసుదన్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులను కలిసి ఏఎన్‌ఎంలు వినతి పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం 5200 మంది రెండో ఏఎన్‌ఎంలను రోడ్డున పడేసే పద్ధతిలో జూలైల్లో నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అక్రమంగా ఇచ్చిన నోటిఫికేసన్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు కొండన్న, చంద్రకళ, శారద, గిరిజ, శివలీల, లలిత, మనెమ్మ, అనసూయమ్మ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు


అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాజాతా

నర్వ: గ్రామాల్లో ప్రజలు మత్తు పదార్థాలకు బానిస కాకూడదని హెడ్‌కానిస్టేబుల్ తిరుపతయ్య అన్నారు. బుధవారం జక్కన్నపల్లిలో పోలీస్ కళాజాతా చే సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, గుట్కా, మద్యపానానికి బానిసలై యువకులు తమ బావి జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. ప్రజలు ఇటీవల సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే 1930, 100కు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి, కళాజాతా సభ్యులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న రమేష్

అమరచింత: అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలంటూ వచ్చే నెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్ తెలిపారు. పట్టణంలోని జీఎస్ భవనంలో బుధవారం సీఐటీయూ మండల సమావేశంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటితరంగ కార్మికులకు ఇప్పటి వరకు సమగ్రమైన చట్టం తీసుకురాకుండా కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందని ఆరోపించారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం అసంఘటిత రంగ కార్మికులందరూ పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో బుచ్చన్న, ప్రభాకర్, సంధ్య, రవి, రమేష్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: తెలంగాణ వస్తే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం ఉండదని ప్రకటించిన సీఎం కేసీఆర్ ఇప్పుడెందుకు వాటిని కొనసాగిస్తున్నారని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ యోసేపు, జేఏసీ చైర్మన్ వేణుగోపాల్ ప్రశ్నించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను పూర్తిగా ఎత్తివేసి రెగ్యూలరైజ్ వ్యవస్థను ఒక్కటే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ సమీపంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలే నిరహార దీక్షలకు వారు మద్దతు ప్రకటించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షణ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. సమగ్ర శిక్షణ ఉద్యోగుల దీక్షకు పలువురు అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు మద్దతు తెలిపారు.

కొత్త వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

మహబూబ్‌నగర్ క్రైం: కొత్త వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, కాలనీల్లో ఎవరైనా అనుమానస్పదంగా కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. రాజీవ్ గృహకల్పలో బుధవారం రాత్రి కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఇళ్లను తనిఖీ చేయడంతో పాటు స్థానికంగా నివాసం ఉండే వారి వివరాలు పరిశీలించారు. దీంతో పాటు సరైన పత్రాలు లేని 15ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు, రెండు కార్లను సీజ్ చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని, సెల్‌ఫోన్‌లకు ఏదైనా ఆఫర్ పేరుతో మెసేజ్‌లు వస్తే క్లిక్ చేయరాదన్నారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. సెకండ్ హ్యాండ్‌లో వాహనాలు కొనుగోలు చేస్తే జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం


అధికారులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కోస్గి: బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ వెంకటయ్య, ఎంపీఓ రహమత్‌లను బుధవారం మండల ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులను ఎంపీపీ మధుకర్‌రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సాయిలు, ఎంపీటీసీలు సన్మానించారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కోస్గి: పట్టణంలోని పాలబావి సమీపంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం ఎంపిక చేసిన ప్రభుత్వ భూమిని తహసీల్దార్ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. ఆర్‌ఐ సుభాష్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ హన్మంతుతో కలిసి 1856 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి రికార్డుల ఆధారంగా ఉన్న వివరాలు నమోదు చేసుకున్నారు.